క్లుప్తంగా

కనుల వైకుంఠంగా లక్ష్మీ జయంతి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామ స్వామి ఆలయంలో సోమవారం లక్ష్మీ జయంతి వేడుకలు కనుల వైకుంఠంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజ, 108 మంది మహిళలతో సామూహిక లక్ష్మీపూజ, 108 తామర పువ్వులతో పూజ, లక్ష్మీ హోమం, పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు జరిగాయి. మహిళలతో శాస్త్రోక్తంగా పూజలు చేయించారు. ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మద్యం విక్రయాల్లో అప్రమత్తం

కాకినాడ క్రైం: ఎన్నికల వేళ మద్యం విక్రయాల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్టు డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎస్‌కేడీవీ.ప్రసాద్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో నిబంధనలకు అనుగుణంగానే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు. నిబంధనలను అతిక్రమించినట్టు తెలిస్తే, తక్షణమే ఎక్సైజ్ కంట్రోల్ రూం నంబరు 0884–2376227కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయాలు చేపడుతున్నారని, సమయ పాలన పాటించడం లేదని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఎక్సైజ్ సిబ్బంది, స్క్వాడ్లు తరచూ తనిఖీలు నిర్వహిస్తుండడం సత్ఫలితాలనిస్తోందన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన స్క్వాడ్



సామర్లకోట ఏడీబీ రోడ్డులో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

సామర్లకోట: ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో 24 గంటలూ పని చేసేలా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సురేష్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో నగదును వెంట తీసుకు వెళ్లేవారు పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. పట్టణ, మండల పరిధిలోను ఏడీబీ రోడ్డులో వెళుతున్న వాహనాలను, నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న వాహనాలనూ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వివాహాలకు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లేవారు వెంట నగదు తీసుకు వెళ్లే సమయంలో తగిన ఆధారాలు ఉండాలన్నారు. అనుమతి లేకుండా నగదు, మద్యం వాహనాల్లో ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వివిధ గ్రామాల్లో పర్యటించి ఎన్నికల నిబంధనలను రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు.

వ్యవసాయ క్షేత్రంలో అగ్ని ప్రమాదం

తుని రూరల్: మండలంలోని హంసవరంలో రైతు మజ్జూరు కొండకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దుక్కు ట్రాక్టర్, ఎడ్లబండి, పశువుల పాక, గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు తుని అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్, మాజీ సర్పంచ్ అత్తి వెంకటరమణ, నాయకుడు రాయి దాసు, పాపారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత రైతును పరామర్శించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి బాధితుడిని ఆదుకుంటామని సర్పంచ్ మేరీఅవినాష్ తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

కేసు కొట్టివేత

తుని: జీఎంఆర్ గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణం పబ్లిక్ హియరింగ్ సమయంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నరసింహారావుపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ తుని మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. కేసుకు సంబంధించిన వివరాలను న్యాయవాది ఏకే మల్లేశ్వరరావు తెలిపారు. 2017లో తొండంగి మండలంలో జీఎంఆర్ గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి పబ్లిక్ హియరింగ్‌కు హాజరు కావడానికి వచ్చిన రైతు సంఘం నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడేళ్ల పాటు విచారణ జరిగిందని, ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన న్యాయమూర్తి కేసును కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చారని చెప్పారు.

చేరికల హోరు.. కార్యకర్తల్లో హుషారు

- వైఎస్సార్ సీపీలోకి క్యూ కడుతున్న టీడీపీ, జనసేన శ్రేణులు
- వరుస చేరికలతో కాకినాడ రూరల్‌లో ఫుల్ జోష్
- చేరిన వారందరికీ పార్టీలో సముచిత స్థానం : ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడులైన తరువాత రాజకీయం వేడెక్కింది. కాకినాడ రూరల్ నియోజవర్గ బరిలో మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మరోసారి పోటీలో నిలిచారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడి హోదాలో పార్టీ కార్యక్రమాలు చక్కబెడుతూనే.. రూరల్ నియోజకవర్గంలో పార్టీని బలమైన శక్తిగా మార్చారు. మే నెలలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో కొద్ది రోజులుగా టీడీపీ, జనసేన పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుతున్నారు. వరుస చేరికలతో వైఎస్సార్ సీపీ ఫుల్ జోష్‌లో ఉంది. మరోవైపు గ్రామ స్థాయిలో పార్టీ నాయకులు ఇంటింటికీ ప్రచారం చేపడుతూ.. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు, ఎమ్మెల్యేగా కన్నబాబును, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరుతున్నారు.



రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద కరప నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన కార్యకర్తలతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, సత్యనారాయణ తదితరులు



వైఎస్సార్ సీపీలోకి చేరిన వాకలపూడి మినీ గూడ్స్ ఆటో యూనియన్ సభ్యులతో ఎమ్మెల్యే కన్నబాబు

ఉదయం నుంచీ రాత్రి వరకూ..

రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకూ ఏదో గ్రామం నుంచి ఇక్కడకు వచ్చి.. వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారు. కరప మండల కేంద్రానికి చెందిన జనసేన నాయకుడు ముద్రగడ నానాజీ, నున్న వీరబాబు, రెడ్డి శివ, బొడ్డు సోసురాజు, లంకె వీరబాబు, పట్టా తాతాజీ, బొచ్చె వీరవెంకట మణికంఠతేజ, నక్కా అఖిల్, పేకేటి నవీన్, గుబ్బల తేజ, అప్పనపల్లి రాజు, నున్న చంటి తదితరులు సుమారు 30 మంది ఎమ్మెల్యే కన్నబాబు, కురసాల సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి సోమవారం చేరారు. కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, వైఎస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు(భీమన్న) సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, లోహిదాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి వచ్చిన వారికి కన్నబాబు పార్టీ కండువాలను వేసి స్వాగతించారు.

మినీ గూడ్స్ ఆటో యూనియన్ సభ్యుల చేరిక

మరో కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాకలపూడి గ్రామ నాయకులు గొల్లపల్లి కాశీ, నల్లా శ్రీను ఆధ్వర్యంలో అమరావతి మినీ గూడ్స్ ఆటో యూనియన్ సభ్యులు పెంకే శ్రీనివాస్, గెద్దాడ సూరిబాబు, రాజేష్, ఏడిద నాగరాజు, పాలిక సుబ్రహ్మణ్యం, తోలుం రాంబాబు, కృష్ణ, సవరపు సత్యనారాయణ తదితరులు 70 మంది ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి, ఎమ్మెలే కన్నబాబు సాదరంగా ఆహ్వానం పలికారు. అదే విధంగా కాకినాడ మూడో డివిజన్ గొడారిగుంటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మాదబోయిన నేరేళ్లు ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో మరకత మణికంఠ స్వామి

బోట్‌క్లబ్: అయ్యప్పస్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర సందర్భంగా సోమవారం స్థానిక భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక రామారావుపేటలో ఉన్న మరకత మణికంఠ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం అర్చకులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి పాలు, పంచదార, విబూది, గంధం, కొబ్బరినీరు, తేనె, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. పీఠం వ్యవస్థాపకుడు నందమూరి వినోద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

దాడి చేశారంటూ అర్చకుల ఫిర్యాదు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): విధి నిర్వహణలో ఉండగా ఆలయానికి వచ్చిన ఓ భక్తుడు తమపై దాడి చేశారని ఆలయ పూజారులు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులకు, పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కాకినాడ దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులైన సాయి, విజయ్‌కుమార్ సోమవారం విధుల్లో ఉండగా, మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రరావు తమను కొట్టారని ఆలయ ఈఓ ఆర్ రాజేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, రాష్ట్ర సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, అఖిల భారత బ్రాహ్మణ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ద్రోణం రాజు రవికుమార్ దృష్టికి తీసుకెళ్లినట్టు అర్చకులు విలేకర్లకు తెలిపారు. అనంతరం అర్చకులు దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు.



ఆలయ ఈఓ రాజేశ్వరరావుకు ఫిర్యాదు అందిస్తున్న భీమేశ్వరస్వామి ఆలయ అర్చకులు

లేపాక్షిలో 29 వరకు థీమాటిక్ ఎగ్జిబిషన్

బోట్‌క్లబ్: నాగమల్లితోట జంక్షన్‌లోని లేపాక్షి ఎంపోరియంలో ఈ నెల 25న ప్రారంభమైన థీమాటిక్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తోందని సంస్థ మేనేజర్ వీరబాబు అన్నారు. షోరూంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 29 వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ ఎం.బాలసుబ్రహ్మణ్యంరెడ్డి ఆదేశాల మేరకు ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామన్నారు. తయారీదారులే నేరుగా హస్త కళా వస్తువులను ఈ ఎగ్జిబిషన్‌లో విక్రయిస్తారన్నారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, కలంకారీ చీరలు, బంజారా క్రొచెట్ లేస్, రోజ్‌వుడ్ బొమ్మలు, లెదర్ ల్యాంప్ షేడ్స్, కాశ్మీరీ షాల్స్, కార్పెట్లు, యోగామ్యాట్లు తదితర వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. హస్తకళా వస్తువులు, చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కళాకారులకు చేయూతనివ్వాలని కోరారు. లేపాక్షి ఎంపోరియంలో లభించే వివిధ రకాల వస్తు, వస్త్ర ఉత్పత్తుల్లో ఎంపిక చేసిన వాటిపై 10 నుంచి 40 శాతం ప్రత్యేక డిస్కౌంట్ ఉందన్నారు. నగర ప్రజలు, పర్యాటకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



లేపాక్షి షోరూంలో హస్తకళా వస్తువులు

రంగుల వేడుక



చిన మార్కెట్ ప్రాంతంలో హోలీ పండగను జరుపుకొంటున్న చిన్నారులు, యువకులు



హోలీ వేడుకల్లో రంగులు పూసుకున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు



సర్పవరం జంక్షన్ వద్ద యువతీ, యువకుల హోలీ సందడి

- కాకినాడలో ఘనంగా హోలీ పండగ
- చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆటపాటలు

కాకినాడ సిటీ: హోలీ పండగను మంగళవారం కాకినాడ నగరంతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఆనందంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకున్నారు. ఇంటింటా కలియ తిరుగుతూ రంగులు పూసుకున్నారు. మహిళలు పాటలు పాడుతూ కర్రలు పట్టుకుని, లయబద్ధంగా ఆడుతూ సంతోషాన్ని పంచుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో తీన్మార్ డాన్సులతో ధూంధాం చేశారు. కుర్రకారు కేకలు, కేరింతలతో రంగులు చల్లుతూ, ఆనందంగా రంగుల వేడుకను జరుపుకొన్నారు. నగరంలోని తిలక్ వీధి, దేవాలయం వీధి, మార్కెట్ స్ట్రీట్, సాంబమూర్తి నగర్, సూర్యనారాయణపురం, జగన్నాథపురం, ఏసువారి వీధి, జె.రామారావుపేట, ముగ్గుపేట తదితర ప్రాంతాల్లో యువకులు రంగులను చేతపట్టుకుని, ఆటపాటలతో రంగులను చల్లుకున్నారు.

ఈవెంట్లతో సందడి

కాకినాడ రూరల్: హోలీ పండగను రూరల్ నియోజకవర్గంలో సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. వేకువజామునే యువత వీధుల్లోకి వచ్చి రంగులు పూసుకోవడంతో పాటు, రంగు నీళ్లను చల్లుకుంటూ సందడి చేశారు. పరస్పరం పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. సర్పవరం జంక్షన్‌లో ఎస్‌ఆర్ ఎంటీ మాల్ ఎదురుగా వేర్వేరు చోట్ల రెండు హోలీ ఈవెంట్లను ఏర్పాటు చేశారు. కాకినాడ, పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున యువతీ, యువకులు హాజరై, పండగను ఎంజాయ్ చేశారు. రంగులు పూసుకుని, మ్యూజిక్‌కు అనుగుణంగా డ్యాన్సులు చేశారు.

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

బోట్‌క్లబ్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జంతుహింస నివారణ సంఘంలో హోలీ వేడుకలు నిర్వహించారు. సంఘ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ శ్రీకృష్ణుని విగ్రహానికి, గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంఘ సభ్యులు రంగులు పూసుకుని, హోలీ వేడుకలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు నాగేంద్ర, సభ్యులు చైతన్య, సిరాజ్, పద్మావతి, మనోజ్, మంతెన రామ్ పాల్గొన్నారు.

ఈనాడు రాతలపై తీవ్ర నిరసన

ప్రతులు దగ్ధం చేసిన వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం నేతలు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు ఇచ్చిందని, అయితే క్రిస్టియన్లను తప్పుదారి పట్టించేలా.. హే జీసస్ పేరిట ఈనాడు పత్రిక తప్పుడు రాతలు రాసిందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నేతలు పేర్కొన్నారు. కాకినాడ నగరం రెండో డివిజన్ పరిధిలోని వైద్యనగర్‌లో సోమవారం ఈనాడు రాతలపై క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు దడాల జాషువా గిరి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి, ఈనాడు ప్రతులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఉభయ గోదావరి జిల్లాల జోనల్ ఇన్‌చార్జి, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ, జిల్లా అధ్యక్షుడు జాషువా గిరి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా క్రైస్తవ మైనార్టీ సంక్షేమానికి రూ.416 కోట్ల నిధులు మంజూరు చేశారని, లక్షా 82 వేల మంది క్రైస్తవులు లబ్ధి పొందారని వివరించారు. ఈనాడులో క్రైస్తవ సంక్షేమానికి వ్యతిరేకంగా సీఎం జగన్‌పై వివక్షతో రాతలు రాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ వివక్ష ఉందని ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో పాస్టర్లకు రూ.5 వేల చొప్పున ఇచ్చి ఆదుకున్నారని, జేరూసలెం యాత్రకు రూ.60 వేల ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. క్రైస్తవులతో పాటు, అన్ని మతాలు, సామాజిక వర్గాలకు సీఎం జగన్ సంక్షేమ ఫలాలు అందించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కాకినాడ రూరల్ మండల అధ్యక్షుడు డేవిడ్ లివింగ్ స్టన్, రెవ. సమర్పణరావు, ప్రేమ్‌కుమార్, ప్రసాద్, జి.శ్యాంసన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



ఈనాడు ప్రతులతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు జాన్ వెస్లీ, దడాల జాషువా గిరి, డేవిడ్ లివింగ్‌స్టన్ తదితరులు

కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్‌ఓ వెంకటరావు



కాకినాడ రూరల్‌లో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఓ కిశోర్

కాకినాడ: ఎన్నికల నేపథ్యంలో కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు జేఎన్టీయూకే ఆవరణలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌లను సోమవారం సందర్శించారు. పలువురు ఎన్నికల సిబ్బంది, అధికారులతో కలిసి సివిల్ బ్లాక్‌లోని ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లను ఆర్‌ఓ పరిశీలించారు. అవసరమైన సదుపాయాలన్నీ ఉన్నాయో, లేవో ఆరా తీశారు. ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. విధి నిర్వహణలో ఉండే సిబ్బందికి, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల్లో అసౌకర్యం లేకుండా, అవసరమైన అన్ని సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఆర్‌ఓ దొర, ఎలక్షన్ డీటీ సీతాపతిరావు, ఏఈ రమేష్, సర్వేయర్ ఆచార్యులు, శానిటరీ సూపర్‌వైజర్ జీలాని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సూర్యారావుపేట, ఎస్.అచ్యుతాపురంలో..

కాకినాడ రూరల్: నియోజకవర్గ పరిధిలోని సూర్యారావుపేట, ఎస్.అచ్యుతాపురం పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను కాకినాడ రూరల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలు, బూత్ వివరాలు, ఓటర్లు ఓటు వేసేందుకు వీలుగా మెట్లు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఇబ్బంది లేకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

నీటి ఎద్దడికి చెక్

- రూ.1.28 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం
- నగరపాలక సంస్థ ముందస్తు చర్యలు

కాకినాడ: రానున్న వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన కార్యాచరణకు కాకినాడ నగరపాలక సంస్థ సిద్ధమైంది. కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశాల మేరకు నీటి సరఫరా, ఇంజినీరింగ్ విభాగం ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలతో సమాయత్తమైంది. కాల్వలు మూసే సమయం నుంచి, తిరిగి తెరిచే వరకూ నగర ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందస్తు కార్యాచరణలో భాగంగా రూ.1.28 కోట్ల ఖర్చు కాగల ప్రతిపాదనలకు టెండరు ప్రక్రియను కూడా పూర్తి చేశారు.

రూ.1.28 కోట్ల ప్రణాళిక

వేసవి కార్యాచరణలో భాగంగా రూ.1.28 కోట్లతో పలు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కార్పొరేషన్ వద్ద ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆరు నీళ్ల ట్యాంకర్లకు అదనంగా, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు అందించేందుకు రూ.25 లక్షలు కేటాయించారు. జనరేటర్ల కోసం మరో రూ.16 లక్షలు ఖర్చు కాగలదని అంచనా వేశారు. బోర్ల మరమ్మతులు, ఇతర అంశాల కోసం రూ.15.55 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. మొత్తంగా రూ.1.28 కోట్ల ప్రతిపాదనలతో సమాయత్తమయ్యారు. అలాగే కాకినాడ నగరంలో సుమారు 15 ప్రాంతాల్లో చలివేంద్రాల ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

వేసవి జలాశయాల్లో సమృద్ధిగా నీరు

దాహార్తిని తీర్చే ప్రధాన వనరులైన సామర్లకోట సాంబమూర్తి రిజర్వాయర్, అరట్లకట్ల వేసవి జలాశయాల్లో నీటిని సమృద్ధిగా నిల్వ చేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ఇందులో అరట్లకట్ట రిజర్వాయర్‌లో ఇప్పటికే నీరు సరిపడినంతగా ఉందని చెబుతున్నారు. సామర్లకోట రిజర్వాయర్‌ను కూడా పూర్తి నీటి వనరులతో సిద్ధమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. సామర్లకోట జలాశయంలో 1,582 మిలియన్ లీటర్లు, అరట్లకట్టలో 821 మిలియన్ లీటర్ల నీటి సామర్థ్యం ఉండడంతో వేసవిలో నీటి కొరత ఉండదని భావిస్తున్నారు. వాస్తవానికి అందుబాటులో ఉన్న నీటి నిల్వలతో నగరంలోని 52 వేల కుళాయి కనెక్షన్లు, 1,700 పబ్లిక్ ట్యాప్‌లకు 22 ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్ల ద్వారా సమృద్ధిగా నీరు అందించగలమన్న ధీమాతో నగరపాలక సంస్థ ఉంది. ఇక కాకినాడలోని పర్లోపేట, సంజయ్‌నగర్, గణేష్‌నగర్, జ్యోతుల కాలనీ వంటి ప్రాంతాల్లో నీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని భావిస్తున్నప్పటికీ, ఈ పరిస్థితిని అధిగమించగలమని చెబుతున్నారు. మరోవైపు గతంలో మహాలక్ష్మినగర్ ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కొనే పరిస్థితుల్లో అక్కడ 1,500 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఈఎల్ఎస్ఆర్‌లను నిర్మించడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.



కాకినాడలోని విక్టోరియా వాటర్ వర్క్స్

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



రానున్న వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం వేసవి కార్యాచరణను సిద్ధం చేశాం. ఆ మేరకు నగరపాలక సంస్థ ఏర్పాట్లు చేసింది. ప్రధాన ప్రాంతాల్లో చలివేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోను నీటి ఎద్దడి లేకుండా ఉండాలన్నదే ప్రధాన లక్ష్యం.

– జె.వెంకటరావు, కమిషనర్, నగరపాలక సంస్థ

వరి కోతలు ప్రారంభం



పీబీ దేవంలో యంత్రంతో చేస్తున్న వరి కోతలు

సామర్లకోట: దాళ్వా వరి కోతలు మండల పరిధిలో ప్రారంభమయ్యాయి. మండలంలో 22,250 ఎకరాల్లో అన్నదాతలు వరి సాగు చేశారు. ఇందులో 18,500 ఎకరాల్లో గోదావరి కాలువ సాగునీటితోను, మిగిలిన పంట భూములు ఏలేరు కాలువ, బోర్ల సహాయంతో చేపట్టారు. ప్రస్తుత దాళ్వాకు నీటి ఎద్దడి ఉంటుందని, రైతులు, అధికారులు ఆందోళన చెందారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా వరి పంట కోతకు వచ్చింది. ప్రస్తుతం మండలంలోని పీబీ దేవం, జి.మేడపాడు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమైనట్టు మండల వ్యవసాయాధికారి ఐ.సత్య తెలిపారు. ప్రస్తుత దాళ్వాలో 90 శాతం వరకు బొండాలు వేయడం వల్ల పంట ఆలస్యంగా వచ్చే అవకాశాలున్నాయని ఏఓ తెలిపారు. వీకే రాయపురం గ్రామంలో వరి నాట్లు ఆలస్యంగా వేయడం వల్ల మరో నెల రోజుల వరకూ వరి పంట చేతికొచ్చే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. సన్న రకాలు 120 రోజులు, బొండాలకు 130 రోజులకు పంట కోతకు వస్తుందని ఏఓ సత్య తెలిపారు.